క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం



బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు

కర్నూలు(కర్నూలు): కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఎం మండల అధ్యక్షుడు ఉసేనయ్య అన్నారు. బుధవారం గొందిపర్ల గ్రామంలోని ప్రధాన కూడలిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ కాపీల పత్రులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఉసేనయ్య మాట్లాడుతూ సామాన్య ప్రజలకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, కార్మికులకు బడ్జెట్ వల్ల ఎటువంటి ఉపయోగం లేదన్నారు. కేవలం బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు ఉపయోగపడేలా ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి.ఆంజనేయులు, సీపీఎం నాయకులు శ్రీరాములు, చంద్రన్న, మునిస్వామి, భీసన్న, శ్రీనివాసరెడ్డి, కార్మిక నాయకులు మాదన్న, పాల్గొన్నారు.

మాలల యుద్ధ గర్జనకు తరలిరావాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాలమహానాడు సభ్యులు

సి.బెళగల్: ఈనెల 23న కర్నూలులోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న మాలల యుద్ధ గర్జనకు తరలిరావాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నర్సప్ప, జిల్లా గౌరవ అధ్యక్షులు రాజోలప్ప కోరారు. బుధవారం వారు మాల మహానాడు మండల అధ్యక్షుడు శశిధర్‌తో కలిసి ‘హలో మాల.. చలో కర్నూలు’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు రంగన్న, నల్లన్న, మద్దిలేటి, మునిస్వామి, ఉదయ్ ఉన్నారు.

భారతీయ సంస్కృతిపై అవగాహన



జనార్దన్‌ను సన్మానిస్తున్న డీన్ అశోక్‌కుమార్

పాణ్యం: మండల పరిధిలోని ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలపై అవగాహన కల్పించారు. ఆర్‌ఎస్‌ఎస్‌ఏ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి జనార్దన్ హాజరై మాట్లాడారు. భారతీయ వారసత్వం సంస్కృతి, సంప్రదాయాలు, ఒక జ్ఞానవంతమైనవన్నారు. సాంకేతిక విద్యలో సంస్కృతిపై అవగాహన అవసరమన్నారు.కార్యక్రమంలో డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ పాల్గొన్నారు.


గోరుకల్లులో 10 టీఎంసీల నీరు



గోరుకల్లులో నిల్వ ఉన్న నీరు

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయంలో 10 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ సుభకుమార్ బుధవారం తెలిపారు. బనకచర్ల క్రాస్ రెగ్యూలేటర్ నుంచి బైపాస్ కెనాల్ ద్వారా ఎస్సార్బీసీకి 800క్యూసెక్కుల నీటిని పంపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గోరుకల్లు జలాశయంలో 10.79టీఎంసీల నిల్వ ఉన్నట్లు చెప్పారు. అవుట్‌ఫ్లో రెగ్యులేటర్ నుంచి నీటిని నిలిపివేశామన్నారు. జలాశయంలో నిర్వహణ పనులు జరుగుతున్నాయన్నారు.

సింహ వాహనంపై శ్రీహరి



సింహ వాహనంపై శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి

కర్నూలు కల్చరల్: సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ 19వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం విశేషపూజలు నిర్వహించారు. స్వామివార్లకు పంచామృతాభిషేకం, విశేష అర్చనలు, నవగ్రహ, దుర్గా, లక్ష్మి, కుబేర హోమాలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు సింహ వాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కర్నూలు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.



పెద్దాసుపత్రిలో ఇంతే...!

● రోగులకు వారి కుటుంబసభ్యులే స్ట్రెచ్చర్ బాయ్‌లు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నాల్గవ తరగతి ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా స్ట్రెచ్చర్ బాయ్‌లు లేకపోవడంతో రోగులను వారి కుటుంబసభ్యులే స్ట్రెచ్చర్, వీల్‌ఛైర్‌లపై ఆయా విభాగాలకు తీసుకెళ్లి వైద్యం చేయించాల్సిన పరిస్థితి దాపురించింది. ఆసుపత్రిలో 1956 నాటి పరిస్థితులకు అనుగుణంగా 114 నాల్గవ తరగతి ఉద్యోగుల పోస్టులు మంజూరయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు పోస్టులను పెంచడం గానీ, ఉన్న ఖాళీలు భర్తీ చేయడం గానీ చేయడం లేదు. ప్రస్తుతం 114లో కేవలం 58 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఉన్న 58 మందిలో సగం మంది ఇతర విధుల్లో బిజీగా ఉంటున్నారు. ఈ కారణంగా ఏ విభాగంలోనూ స్ట్రెచ్చర్‌బాయ్, వార్డుబాయ్ కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో కొన్ని చోట్ల పారిశుద్ధ్య కార్మికులే స్ట్రెచ్చర్ బాయ్ అవతారమెత్తుతున్నారు. కొన్ని చోట్ల వారు కూడా కనిపించడం లేదు. ఈ కారణంగా రోగులను వారి కుటుంబసభ్యులే ఇతర విభాగాలకు వైద్యసేవల కోసం తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి ప్రస్తుత ఖాళీలు భర్తీ చేయడమే గాక పోస్టులు పెంచాలని రోగులు కోరుతున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)





ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కూలీల సమస్యలను తెలుసుకుంటున్న నాగన్న

ఓర్వకల్లు: ఉపాధి పథకం కింద పని చేసిన కూలీలకు 6 వారాలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తోందన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ కార్మికులు, రైతులు, అసంఘటిత కార్మికుల ప్రయోజనాలను పక్కనపెట్టి, బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల అధినేతలకు మేలు జరిగే విధంగా బడ్జెట్ రూపొందించారన్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రజలకు వరంగా మారిన ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, 200 రోజులు పనిదినాలు, రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని, పనిముట్లు, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించి, వేసవిలో కూలీలు వడదెబ్బ బారిన పడకుండా నీడ, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల నాయకులు మద్దిలేటి, క్షేత్ర స్థాయి సహాయకులు ఖాజావలి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ కేవైసీ చేయించుకోండి

గడివేముల: రబీ సీజన్‌లో సాగుచేసిన ప్రతి రైతు ఈ కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి హేమ సుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో జరుగుతున్న జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగుచేసిన పంటకు ఈ పంట నమోదు చేసుకున్న అనంతరం ఈ కేవైసీ చేసుకోవాలన్నారు. పంటలు సాగుచేసిన ప్రతి ఒక్కరు స్థానిక రైతు సేవ కేంద్రాల్లో వేలిముద్రలు వేయాలన్నారు. ఈ పంట నమోదు తో కలిగే ఉపయోగాలను రైతులకు వివరించాలన్నారు. ప్రతి రైతు వ్యవసాయ సిబ్బందికి సహకరించి ఈ పంట నమోదు చేసుకోవాలని కోరారు.

ఇరువర్గాల ఘర్షణ

కోడుమూరు రూరల్: గూడూరు మండలం చనుగొండ్ల మజారా గ్రామం వై.ఖానాపురంలో పొట్టేళ్ల బలి విషయంలో బుధవారం ఇరువర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఉప్పరి నరసింహులుతో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఇదే గ్రామానికి చెందిన బోయ రంగయ్య, బోయ రామాంజనేయులు, వీరేంద్ర, మధుకృష్ణ, తిక్క బడేసావు, మరో ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



టమాట పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: రబీ సీజన్ కింద సాగు చేసిన ఆముదం, టమాట పంటలలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ సుధాకర్ సూచించారు. బుధవారం మండలంలోని సోమయాజులపల్లె, తిప్పాయపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ దాని అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆముదం, టమాట పంటలను పరిశీలించారు. ఏఓ సుధాకర్ మాట్లాడుతూ ప్రధానంగా నూనెగింజల పంటలైన ఆముదంలో చీడపీడలైన దాసరి పురుగు, పొగాకు లద్దెపురుగు నివారణకు యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. అందుకు 2 ఎంఎల్ ప్రొఫెనోఫాస్/ 1 ఎంఎల్ నోవల్యూరాన్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి మరీ అధికంగా వుంటే 0.3 ఎంఎల్ ఫ్లూబెండమైడ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవడం వల్ల చీడ పీడలను నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కల్లూరు: పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయురాలు మాలతీదేవి కోరారు. బుధవారం తడకనపల్లె గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని కలసి పాఠశాల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ పాఠశాలకు కాంపౌండ్ వాల్ అసంపూర్తిగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మాధవి, అంగన్‌వాడీ కార్యకర్త స్వర్ణ పాల్గొన్నారు.

చిన్న వయస్సులో ఆడపిల్లలకు పెళ్లిళ్లు వద్దు



బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న జిల్లా నోడలాఫీసర్ డాక్టర్ రఘు

కోడుమూరు రూరల్: చిన్న వయస్సులో ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. బుధవారం కోడుమూరులో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని డాక్టర్ రఘు తనిఖీ చేసి ప్రజలకందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి డాక్టర్ రఘు మాట్లాడుతూ చిన్న వయస్సులో బాలికలకు వివాహాలు చేయకుండా చక్కగా చదివించుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక నష్టాలున్నాయని, బాలికలు చదువుకుంటే భవిష్యత్‌లో వారి కుటుంబాలు కూడా బాగుంటాయన్నారు. కార్యక్రమంలో కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మధు, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాభాయి, ఎంఎల్‌హెచ్‌పీ తిరుమలమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు లేగదూడల పెంపకంపై అవగాహన

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో గురువారం లేగదూడల పెంపకంపై అవగాహన కార్యక్రమం ఉంటుందని పశుసంవర్ధకశాఖ ఏడీ కమలాకర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా దూడలపెంపకంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ఏపీఎల్‌డీఏ జిల్లా అధికారులు హాజరవుతారని, పాడి రైతులు, పశుపోషకులు పాల్గొనాలన్నారు.

కార్మికుల కడుపు కొడితే సహించేది లేదు



కోడుమూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

కోడుమూరు రూరల్: కార్మిక వ్యతిరేక చట్టాలను తెచ్చి కార్మికుల కడుపు కొట్టాలని చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును సహించేది లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ హెచ్చరించారు. కేంద్రం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ బుధవారం సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కోడుమూరులోని కోట్ల సర్కిల్లో రోడ్డుపై రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలు, త్యాగాలు చేసి తెచ్చుకున్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. కేంద్రం ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులకు భద్రత కరువైందన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకిస్తూ కార్మికులంతా ఐక్యమత్యంగా పోరాడాలన్నారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు రాజు, గఫూర్‌మియ్యా, చిన్న రాముడు, వీరన్న, ఆటో మధు, చిన్న, నాగరాజు, బుడ్డప్ప, మునిస్వామి, శంకర్ పాల్గొన్నారు.

గూడూరులో..

కేంద్రం ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ బుధవారం గూడూరులోని పాతబస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. స్థానిక సీఐటీయూ నాయకులు రాజశేఖర్, దానమన్న, కొమ్ము రాజు, చిన్న రాజు, శాంతన్న పాల్గొన్నారు.

కోలుకోలేక విద్యార్థి మృతి

ఓర్వకల్లు: పిచ్చికుక్క కాటుతో గాయపడిన విద్యార్థి కోలుకోలేక బుధవారం ఆసుపత్రిలో మృతి చెందిన ఘటన మండలంలోని కాల్వబుగ్గ గ్రామంలో చోటుచేసుకోంది. స్థానికుల వివరాల మేరకు గ్రామానికి చెందిన జిలానీబాష, రసూల్‌బీకి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. దంపతులు ఇద్దరు స్థానికంగా కొబ్బరికాల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో చిన్న కుమారుడు మొహిద్దీన్(11) అనే బాలుడు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో జనవరి 9వ తేదీన ఇంటిముందు ఆడుకుంటుంగా, పిచ్చికుక్క కరవడంతో కుటుంబ సభ్యులు హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లితే వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. అయినా బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడ కాకపోవడంతో, మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ 29 రోజులు చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పదికాలాలు ఆయురారోగ్యాలతో వుండాల్సిన బాలుడు మృతి చెందడంతో తల్లితండ్రులకు కడుపు కోతమిగిల్చడంతో తల్లితండ్రులు కన్నీరు మున్నీరయ్యారు కావడంతో స్థానికులను కలచివేసింది.

అలగనూరు బలోపేతానికి ప్రతిపాదనలు

కర్నూలు (సిటీ): కేసీ కెనాల్ నీటిని నిల్వ చేసేందుకు ఉన్న ఏకైక రిజర్వాయర్ అలగనూరు. ఈ రిజర్వాయర్ కరకట్టలు 2015 నుంచి కుంగిపోతున్నా అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు పట్టించుకోలేదు. రిజర్వాయర్ మరమ్మతులు చేసి రివిట్మెంట్‌ను సరిచేయాలని జలవనరుల శాఖ ఇంజినీర్లు 2017లో సూచించినప్పటికీ కాలయాపన చేయడంతో రిజర్వాయర్‌పై ఆధారపడిన రైతులు, ప్రజలు సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ రిజర్వాయర్ బలోపేతం చేసేందుకు తాజాగా రూ.36.26 కోట్లకు అంచనాలు వేశారు. 2017లోనే మరమ్మతులు చేసి ఉంటే కరకట్ట దెబ్బతినేది కాదని, చుట్టూ ఉండే మట్టి నమూనాల పరీక్షల్లో వచ్చిన ఫలితాల ప్రకారం పూర్తిస్థాయిలో బండ్‌ను తొలగించి కొత్తగా చేపట్టాలని నివేదికలు ఇచ్చారు. ఈ నివేదికల ప్రకారం మొత్తం కట్ట పునాది నుంచి పునఃనిర్మాణానికి రూ.26 కోట్లతో ప్రభుత్వానికి కేసీ ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. అయితే అప్పట్లో రిజర్వాయర్ పనులు చేయలేకపోయారు. రైతులు అలగనూరు రిజర్వాయర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని జలవనరుల శాఖ ఇంజినీర్లు తాజాగా మరోసారి అంచనాలను వేసి ప్రభుత్వానికి బుధవారం పంపారు. కర్నూలు–కడప కాలువ నీటిని తాత్కాలికంగా నిల్వ చేసేందుకు రిజర్వాయర్లు లేవు. తుంగభద్ర నదిలో నీటి లభ్యత తగ్గిపోతుండటంతో రబీ సీజన్‌లో చివరి ఆయకట్టుకు సాగునీరు, తాగునీటి కోసం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో చివరి ఆయకట్టును స్థిరీకరించేందుకు ఓ రిజర్వాయర్‌ను నిర్మించేలా 1985 సంవత్సరంలో అలగనూరు రిజర్వాయర్‌కు రూ.3.06 కోట్లకు కేవలం పరిపాలన ఆమోదం తెలుపుతూ జీఓ ఎంఎస్ నంబర్ 327 జారీ చేశారు. అయితే ఆ తర్వాత 1993 వరకు ఎవరూ పట్టించుకోలేదు. ఈ సమయంలో కేసీ కెనాల్ జైకా నిధులతో ఆధునికీకరించే పనుల్లో భాగంగా రూ.59.90 కోట్లతో రిజర్వాయర్‌ను చేపట్టారు.

రేపు నెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల ఆవరణలో ఈనెల 7వ తేదీన అండర్–18 బాలబాలికల విభాగంలో నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15, 16 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించే 10వ రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. వివరాలకు 93938 55460 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కష్టపడే వారికే పదవులు

● వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న నేతలు

కల్లూరు: పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి గుర్తింపుతో పాటు పదవులు దక్కుతాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పార్టీలో పాణ్యం నియోజకవర్గం పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులుగా నియమితులైన రంగనాథ్ గౌడ్ బుధవారం సాయంత్రం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ అధ్యక్షుల నియామకం

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కర్నూలు నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు బుధవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

అధ్యక్షుడి పేరు	విభాగం		
బి.బాలాంజనేయయులు (బాలు)	యూత్‌విభాగం	సి.శేషన్న (డేవిడ్)	గ్రీవెన్స్ సెల్ విభాగం
కె.మంగమ్మ	మహిళా విభాగం	భరత్ అభి	వాణిజ్య విభాగం
కె.మోహన్ గౌడ్	రైతు విభాగం	ఎం.నీలకంఠ	వీవర్స్ విభాగం
సి.సాములు	బీసీ సెల్	కొట్టాల ప్రకాష్	వైఎస్సార్‌టీయూసీ
కె.పరుశురాం	ఎస్సీ సెల్	వి.రాధికమ్మ	అంగన్‌వాడీ విభాగం
పి.రవి	ఎస్టీ సెల్	సి.వి.రాంప్రసాద్	లీగల్ సెల్
ఎం.బాషా	మైనార్టీ సెల్	ఎం.కృష్ణకాంత్ శర్మ	కల్చరల్ విభాగం
ఎస్.ప్రేమ్‌కుమార్	క్రిస్టియన్‌మైనార్టీ సెల్	జి.అశోక్ కుమార్	సోషల్‌మీడియా విభాగం
ఎస్.అన్వర్	స్టూడెంట్ విభాగం	కె.నరేంద్ర బాబు	ఐటీ విభాగం
పి.షాషావలి	మున్సిపల్ విభాగం	సి.పాండురంగ	దివ్యాంగుల విభాగం
జి.రాజశేఖర్	ఆర్‌టీఐ విభాగం	డాక్టర్ డి.ఇస్మాయిల్	డాక్టర్స్ విభాగం
ఎస్.టి.షేక్ అహ్మద్	వలంటీర్స్ విభాగం	టి.ఆనంద్ రెడ్డి	ఇంటెలెక్చువల్స్ విభాగం
		పి.చక్రపాణి రెడ్డి	బూత్ కమిటీ
		ఉస్తాద్ మహబూబ్ అలీ	పబ్లిసిటీ విభాగం

అభివృద్ధి పనుల ప్రారంభం



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో బుధవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా తడకనపల్లె గ్రామంలో గోకులం షెడ్, సీసీ రోడ్లు ప్రారంభించారు. అనంతరం హంద్రీనివా కాలువ నుంచి చెరువుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి, సర్పంచ్ సహేరాబీ, ఏపీ ఫైనాన్స్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, పంచాయతీ రాజ్ అధికారులు, మండల పరిషత్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నులి పురుగుల దినోత్సవాన్ని నిర్వహించాలి



ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు ఆల్‌బెండజోల్ మాత్రలు అందిస్తున్న వైద్య సిబ్బంది

పాణ్యం: ఈనెల 10న జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని నిర్వహించాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం మద్దూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎంపీడీఓకు ఆల్‌బెండజోల్ మాత్రలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కలిపి మొత్తం 14,800 మంది పిల్లలు ఉన్నట్లు తెలిపారు. 10న మధ్యాహ్న భోజనం తర్వాత అరగంటకు మాత్రలు వేయాలన్నారు. 1–2 సంవత్సరాల వయస్సున్న విద్యార్థులకు సగం మాత్ర, 2–19 సంవత్సరాలు వయస్సున విద్యార్థులకు పూర్తి మాత్ర వేయాలన్నారు. ప్రస్తుతం మాత్రలను ఎంఈఓ కోటయ్య ద్వారా ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాలన్నారు. ఎక్కడా అలసత్వం వహించరాదన్నారు. మాత్రలు పంపిణీ చేసే క్రమంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అందరూ కలిసి విజయవంత చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారెడ్డి, ఏఓ వరలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ అనిత్ పాల్గొన్నారు.

రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయండి



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు (అర్బన్): జిల్లాలో చేపట్టిన పలు సర్వేలకు సంబంధించి రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి సూచించారు. ఆయన బుధవారం సాయంత్రం జిల్లా పరిషత్‌లోని తన చాంబర్‌లో కర్నూలు, పత్తికొండ డీఎల్‌డీఓలతో కలిపి ఎంపీడీఓలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిస్సింగ్ సిటిజన్స్ సర్వేకు సంబంధించి నందవరం, ఆలూరు, కృష్ణగిరి ఎంపీడీఓలు తక్కువ పురోగతి సాధించారని, ఇంకా మెరుగుపర్చుకోవాల్సిన అవసరముందన్నారు. క్యాప్చరింగ్ ఆఫ్ హౌస్ ఇమేజ్ అండ్ జియో కోఆర్డినేట్స్‌కు సంబంధించి రాష్ట్రంలో జిల్లా 12వ స్థానంలో ఉందని, దీన్ని మొదటి స్థానంలోకి తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్‌పీసీఐ యాక్షన్ టేకెన్‌లో జిల్లాలో 2,167 రికార్డులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా రెండు రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. ఇన్‌యాక్టివ్‌లో ఉన్న ఎన్‌పీసీఐ రికార్డులన్నింటినీ 15 రోజుల్లోగా యాక్టివ్‌లోకి తీసుకురావాలన్నారు. అలాగే 0–6 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లల ఆధార్ నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు.

క్షతగాత్రులను కాపాడటం అందరి బాధ్యత

కర్నూలు(హాస్పిటల్): రహదారి ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సహాయం చేయడం మనందరి బాధ్యత అని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (డీటీసీ) ఎస్.శాంతకుమారి చెప్పారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని లెక్చరర్ గ్యాలరీలో గుడ్‌సమారిటన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగినప్పుడు ఘటన స్థలంలో ఉన్న ఎవరైనా సరే అంబులెన్స్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. క్షతగాత్రులను రక్షించడంలో మొదటి 60 నిమిషాలు కీలకమని, ఆలోగా ఆస్పత్రికి చేర్చేలా కృషి చేయాలన్నారు. కొత్త చట్టాల ప్రకారం సహాయం చేసిన వారిని పోలీసులు, హాస్పిటల్ సిబ్బంది ఇబ్బంది పెట్టడానికి అవకాశం లేదన్నారు. రహదారి ప్రమాదాల్లో క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారికి ప్రభుత్వం రూ.5 వేల నగదు ప్రోత్సాహకం, సర్టిఫికెట్ అందజేస్తారని వివరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే క్షతగాత్రులకు సత్వర వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేసుకోవాలని సూచించారు. ఆర్‌టీఓ భరత్ చౌహాన్, డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై లింక్ పైపులు



ఈర్లదిన్నెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: బిందు సేద్యంలో భాగంగా రైతులకు లింక్ పైపులను సబ్సిడీపై అందజేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన వ్యవసాయ సిబ్బందితో కలిసి ఈర్లదిన్నె గ్రామ సమీపంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు వ్యవసాయంలో చేపట్టాల్సిన సంరక్షణ పద్ధతులను, ఆధునిక వ్యవసాయ పద్ధతులను, వ్యవసాయ యాంత్రీకరణ, విత్తనోత్పత్తి పద్ధతులను, సబ్సిడీ పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు ఉన్నారు.